కన్నడనాట.. కుర్చీలాట!

వరుస స్కామ్‌లతో సిద్ధరామయ్య ఉక్కిరిబిక్కిరి.. సీఎం పదవిపై అనాసక్తి

- సీఎం పీఠంపై డీకే శివకుమార్ కన్ను
- తెరవెనుక వేగంగా మంత్రాంగం
- మంత్రి సతీశ్ జార్కిహోళితో భేటీ
- మద్దతు ప్రకటించాలంటూ అభ్యర్థన
- డీకేకు మద్దతుపై జార్కిహోళి విముఖత
- సీఎం పదవిపై ఆసక్తితో ఉండటమే కారణం
- పరమేశ్వర, ఖర్గే పేర్లను పరిశీలిస్తున్న అధిష్ఠానం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో సీఎం పోస్టుకు గ్యారెంటీ ఉండదని అంటారు. చరిత్ర చెప్తున్న సత్యమిది. అధికారంలోకి వచ్చి 15 నెలలు కాకముందే కర్ణాటకలో మరోసారి సీఎం పదవి కోసం కుర్చీలాట మొదలైంది. సీఎం సిద్ధరామయ్య వరుస స్కామ్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతుండటంతో కన్నడ రాజకీయం రసకందాయంలో పడింది. ఇదే అదునుగా సీఎం పోస్టు కోసం కీలక నేతలు తెరవెనుక మంత్రాంగాలు మొదలుపెట్టారు.

సిద్ధరామయ్య అనాసక్తితో..

ముడా భూములు, వాల్మీకి కార్పొరేషన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఇలా వరుస స్కామ్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సిద్ధరామయ్య సీఎం పదవి నుంచి దిగిపోవడానికి సిద్ధమైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే విషయమై అధిష్ఠానం బుజ్జగింపులకు ప్రయత్నించినా.. సిద్ధరామయ్య తిరస్కరిస్తున్నట్టు తెలుస్తున్నది. వెరసి కర్ణాటకలో సీఎం మార్పు త్వరలోనే జరుగనున్నట్టు సమాచారం. ఇదే అదునుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తెరవెనుక మంత్రాంగాన్ని ప్రారంభించారు. మంత్రి సతీశ్ జార్కిహోళితో సోమవారం రాత్రి 40 నిమిషాల పాటు ఏకాంతంగా భేటీ అయ్యారు.

జార్కిహోళితోనే భేటీ ఎందుకు?

నిరుడు కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డీకే సీఎం అవుతారని భావించారు. అయితే, అధిష్ఠానం సిద్ధరామయ్యకు ఆ పదవిని కట్టబెట్టింది. దీనిపై డీకే వర్గం ఎమ్మెల్యేలు గుర్రుగా ఉన్నారు. కానీ, మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు సిద్ధరామయ్యకు ఉండటంతో ఇంతకాలం సీఎం మార్పు జరుగలేదు. ఇదే సమయంలో డీకేకు ఉప ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠానం కేటాయించింది. కాగా, సిద్ధరామయ్య సీఎం పదవి నుంచి దిగిపోతే ఎవరు ఆ రేసులో ఉంటారన్న చర్చ ప్రస్తుతం జరుగుతున్నది. సిద్ధరామయ్య తప్పుకుంటే, సీఎం పదవిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేదా మంత్రి జీ పరమేశ్వరకు కట్టబెట్టాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. దీంతో డీకే.. ఉన్నపళంగా సోమవారం రాత్రి జార్కిహోళిని కలిశారు. ఒకవేళ, సీఎంగా తనను ప్రతిపాదించి మద్దతు ప్రకటిస్తే, కేపీసీసీ అధ్యక్ష పదవి వచ్చేలా తాను అధిష్ఠానాన్ని ఒప్పిస్తానని జార్కిహోళికి డీకే ఆఫర్ ఇచ్చినట్టు తెలిసింది.

కాగా, జార్కిహోళికి 20 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నది. కాబట్టే, జార్కిహోళిని డీకే కలిసినట్టు చెప్తున్నారు.

సీఎం పీఠంపై జార్కిహోళి ఆసక్తి

సీఎంగా డీకేకు జార్కిహోళి మద్దతు ప్రకటించకపోవడానికి బలమైన కారణం ఉన్నదని విశ్లేషకులు చెప్తున్నారు. జార్కిహోళి వాల్మీకి(ఎస్టీ) వర్గానికి చెందిన బలమైన నేత. అధిష్ఠానం తనను సీఎంగా చేస్తుందన్న ఆకాంక్ష ఈయనలో ఉన్నది. గత నవంబర్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'దళితులతో సహా అన్ని వర్గాల ప్రజలు తమ నేత సీఎం అవ్వాలని కోరుకొంటున్నారు.ఆ మేరకు డిమాండ్లు ఉన్నాయి. అయితే దానిపై పార్టీ హైకమాండే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వాల్మీకి గురుపీఠ స్వామీజీ ప్రసన్నానంద నన్ను సీఎంగా చూడాలనుకొంటున్నట్టు పేర్కొన్న విషయం మీకు తెలిసిందే' అని సీఎం పదవిపై తన ఆసక్తిని జార్కిహోళి పరోక్షంగా తెలియజేశారు. డీకే తీరుపై జార్కిహోళి గత కొంతకాలంగా అసంతృప్తితోనూ ఉన్నారు. ఈ క్రమంలోనే తనను సీఎం చేయడానికి మద్దతు ఇవ్వాలన్న డీకే అభ్యర్థనను జార్కిహోళి తిరస్కరించినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

రేవంత్‌కు నోటీసులా? ఏ కేసులో??

- రేపోమాపో రేవంత్‌కు నోటీసులంటూ కర్ణాటక మంత్రి సంచలన వ్యాఖ్యలు
- ఇప్పటికే రేవంత్‌పై 161 పోలీసు కేసులు
- ఇందులో క్రిమినల్ కేసులు 70కిపై మాటే
- సుప్రీంకోర్టులో 'ఓటుకు నోటు' కేసు విచారణ
- ఇందులో ఏ కేసులో రేవంత్‌కు నోటీసులు ఇవ్వొచ్చు
- సోషల్‌మీడియాలో పెద్దయెత్తున జరుగుతున్న చర్చ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్యకు నోటీసులు ఇచ్చినట్టే, రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చంటూ ఆ రాష్ట్ర పీడబ్ల్యూడీ మంత్రి సతీశ్ జార్కిహోళి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డికి ఏ కేసులో నోటీసులు ఇచ్చే అవకాశమున్నదంటూ నెట్టింట పెద్దయెత్తున చర్చ జరుగుతున్నది.

రేవంత్‌పై 161 కేసులు

సీఎం రేవంత్ రెడ్డిపై రాష్ట్రవ్యాప్తంగా 89 పోలీసు స్టేషన్లలో ఇప్పటివరకూ 161 కేసులు నమోదయ్యాయి. ఇందులో 70కిపైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ మేరకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్‌లో రేవంత్ స్వయంగా వెల్లడించారు. ఇక, 2015లో టీడీపీలో ఉన్న రేవంత్‌రెడ్డి.. అప్పటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రూ. 50 లక్షలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడ్డారు. ఇదే 'ఓటుకు నోటు' కేసుగా ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఈ కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. పెట్టుబడుల పేరిట సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి చెందిన 'స్వచ్ఛబయో'తో ఒప్పందం చేసుకోవడం, ఆ కంపెనీ నుంచి తెలంగాణకు రూ.1000 కోట్ల పెట్టుబడులు రానున్నట్టు ప్రకటించడాన్ని తప్పుబడుతూ బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ఇప్పటికే ఈడీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఇందులో ఏ కేసుకు సంబంధించి రేవంత్‌కు నోటీసులు రావొచ్చని నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.

వాల్మీకి స్కామ్‌తో 9 హైదరాబాదీ కంపెనీలకు లింక్?

కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారును కుదిపేస్తున్న 'మహర్షి వాల్మీకి కార్పొరేషన్ లిమిటెడ్'లో వెలుగుచూసిన రూ.187 కోట్ల విలువైన కుంభకోణం మూలాలు హైదరాబాద్‌లోనూ ఉన్నాయని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేసిన ఇటీవలి విచారణలో తేలింది. కుంభకోణంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది కంపెనీల ఖాతాలకు రూ.44.6 కోట్లు జమ అయినట్టు సిట్ నివేదికలో స్పష్టం చేసింది. ఈ ఖాతాలు ఐటీ, జ్యువెలరీ, లిక్కర్ తదితర రంగాలకు చెందిన కంపెనీలవని తెలుస్తున్నది. ఈ స్కామ్ డబ్బునే ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు ముందు ఓ పార్టీ ఖర్చు చేసినట్టు సిట్, ఈడీ నివేదిక వెల్లడించింది. కాగా, వాల్మీకి సామాజిక వర్గంలో బలమైన నేతగా ఉన్న సతీశ్ జార్కిహోళి.. తమ కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టినప్పటికీ ఏమాత్రం స్పందించడం లేదంటూ ఆ వర్గం ప్రజలు ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఇదే విషయమై ఆయనపై పలు విధాలుగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో పెరుగుతున్న అసమ్మతిని చల్లార్చడానికి ఆయన చేయని ప్రయత్నం లేదు. కాగా, 'వాల్మీకి స్కామ్' కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటకలో జరుగడం, అక్కడి డబ్బు తెలంగాణకు చేరడం, తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం అధికారంలో ఉండటం, నోటీసుల గురించి 'వాల్మీకి' సామాజిక వర్గానికి చెందిన బలమైన నేత జార్కిహోళి సంచలన వ్యాఖ్యలు చేయడాన్ని చూస్తే.. ఈ స్కామ్‌లోనే సీఎంకు నోటీసులు వస్తాయా? అంటూ పలువురు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

సీఎం సిద్ధూను మారిస్తే.. రేవంత్‌నూ మారుస్తారా?

మొదటిపేజీ తరువాయి...

సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ విషయం పెద్దయెత్తున చర్చనీయాంశం అవుతున్నది.

జార్కిహోళి ఏమన్నారంటే?

'హిమాచల్, తెలంగాణ సహా మనం మొత్తంగా ఓ మూడు, నాలుగు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉన్నాం. మన ప్రభుత్వాలను కూల్చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రయత్నిస్తున్నది. 'ముడా' స్కామ్‌లో సిద్ధరామయ్యను విచారించడానికి గవర్నర్ అనుమతివ్వడం ఇందులో భాగమే. ఇలాంటి సమయంలోనే హైకమాండ్ దృఢంగా ఉండాలి. పార్టీ శ్రేణులకు సరైన దిశానిర్దేశం చేయాలి. ఒకవేళ, కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారుకు ఏదైనా ఇబ్బంది కలిగితే.. ఆ ప్రభావం తెలంగాణలోని రేవంత్ సర్కారుపై పడొచ్చు. ఇక్కడ సిద్ధరామయ్య ఇబ్బందులను ఎదుర్కొంటే, తర్వాత తెలంగాణలో రేవంత్ రెడ్డి కూడా ఇబ్బందులను ఎదుర్కోవచ్చు. ఇక్కడ సిద్ధరామయ్యకు నోటీసులు వచ్చినట్టే, అక్కడ రేవంత్‌కు కూడా రేపోమాపో నోటీసులు రావొచ్చు. ఆయననూ టార్గెట్ చేయొచ్చు. ఇప్పుడు సిద్ధరామయ్యను సీఎం పోస్టు నుంచి తప్పిస్తే, రేవంత్‌నూ తప్పించాల్సి ఉంటుంది. ఇదే జరిగితే, తప్పుచేసినట్టు మనకు మనం ఒప్పుకొన్నట్టే. కాబట్టి, 'ముడా' కేసులో సిద్ధరామయ్యకు మన మంతా అండగా ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ సీఎంని మార్చొద్దు. ఈ మేరకు అధిష్ఠానం దృఢమైన నిర్ణయాన్ని తీసుకోవాలి' అని జార్కిహోళి పేర్కొన్నారు.

అవును మాకు ఎదురుదెబ్బే

'ముడా' కేసులో సిద్ధరామయ్యను విచారించడానికి గవర్నర్ అనుమతించడం తమకు ఎదురుదెబ్బేనని జార్కిహోళి ఒప్పుకొన్నారు. అయితే, ఈ విషయాన్ని రాజకీయంగా ఎదుర్కోవాల్సిన అవసరమున్నదన్నారు.

సీఎంగా సిద్ధరామయ్యనే ఎందుకంటే?

కర్ణాటకలో నిరుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం పదవికి డీకే శివకుమార్, సిద్ధరామయ్యతో పాటు సతీశ్ జార్కిహోళి కూడా పోటీపడ్డారు. అయితే, అధిష్ఠానం సిద్ధరామయ్యను సీఎంగా ప్రకటించింది. ఈ నిర్ణయంపై డీకే వర్గం అసంతృప్తితో రగిలిపోయింది. ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రయత్నాలు చేసినట్టు వార్తలు వచ్చాయి. అయితే, అప్పటికే డీకే శివకుమార్‌తో విభేదాలు ఉన్న జార్కిహోళి ఇష్టంలేకపోయినా సిద్ధరామయ్యకు మద్దతు ప్రకటిస్తూ వస్తున్నారు. తాజాగా వివాదాల కారణంగా సిద్ధరామయ్య సీఎం పదవికి దూరమైతే, డీకే ఆ పోస్టులోకి రావొచ్చన్న ఊహాగానాలు పెరిగిపోయాయి. డీకే సీఎంగా ఉండటం ఇష్టంలేకనే జార్కిహోళి 'సిద్ధరామయ్యను సీఎంను మార్చొద్దంటూ' అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసినట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

ఖరీదైన ప్రాంతంలో భూమి ఇవ్వండి!

- 2014లో ముడాకు సిద్ధరామయ్య భార్య లేఖ
- స్థలం ఎక్కడ కావాలో కూడా చెప్పిన వైనం
- స్కామ్ బయటపడ్డాక వైట్‌నర్‌తో కొట్టివేత!
- 'ముడా స్కామ్'లో కీలక ఆధారం బయటకు
- సిద్ధరామయ్య చెప్తున్న దానికి విరుద్ధంగా లేఖ

బెంగళూరు, ఆగస్టు 21/(స్పెషల్ టాస్క్ బ్యూరో): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మెడకు చుట్టుకొన్న 'ముడా స్కామ్'లో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. ఈ స్కామ్‌తో తనకు, తన కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని వాదించిన సిద్ధరామయ్య మాటలన్నీ అబద్ధమని తేలింది. ఇందుకు సంబంధించిన కీలక ఆధారం బయటకొచ్చింది. తనకు ఖరీదైన ప్రాంతంలో స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరుతూ మైసూర్ అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ (ముడా) అధికారులకు సిద్ధరామయ్య సతీమణి పార్వతి లేఖ రాశారు. సిద్ధరామయ్య తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన తర్వాత 2014లో ఆమె ఈ లేఖ రాసినట్టు తెలుస్తున్నది. ఈ మేరకు రిపబ్లిక్ కన్నడ న్యూస్ వెబ్‌సైట్ ఓ కథనంలో ఆధారాలను బయటపెట్టింది.

రాసి.. ఆ తర్వాత చెరిపేసి

తనకు ఖరీదైన ప్రాంతంలో స్థలం కావాలంటూ లేఖ రాసిన పార్వతి ఎక్కడ స్థలం కావాలనుకొంటున్నారో ఆ నిర్దిష్ట ప్రాంతాన్ని కూడా లేఖలో స్పష్టం చేశారు. అయితే, దీనిని వైట్‌నర్‌తో ఉద్దేశపూర్వకంగా కొట్టివేశారు. ముడా కుంభకోణం బయటపడ్డాకనే ఆధారాలు చెరిపేయాలనే లక్ష్యంతోనే ఇలా కొట్టేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆధారాలను బట్టి.. భర్త సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఖరీదైన ప్రాంతంలో తనకు భూములు కేటాయించాల్సిందిగా పార్వతి కోరినట్టు అర్థమవుతున్నది. దీనికోసం ఆమె సీఎంగా సిద్ధరామయ్య హోదాను వినియోగించుకొన్నట్టు తెలుస్తున్నది. స్కామ్ విషయం బయటకు రాగానే.. కీలకమైన సమాచారాన్ని చెరిపేయడానికి వైట్‌నర్‌ను కూడా వాడినట్టు స్పష్టమవుతున్నది. కాగా, మైసూరు శివారుల్లోని కెసరె గ్రామంలో సిద్ధరామయ్య భార్య పార్వతికి చెందిన 3 ఎకరాల 16 గుంటల భూములను అవసరాల దృష్ట్యా సేకరించిన ప్రభుత్వం.. వాటికి బదులుగా నగరం లోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగరలో భూములను కేటాయించింది. కెసరెలోని భూములతో పోలిస్తే మార్కెట్ ధర ఎంతో ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిద్ధరామయ్య కుటుంబానికి ఆ భూములను కేటాయించడంపై విమర్శలు వచ్చాయి. దీన్నే 'ముడా' స్కామ్‌గా పిలుస్తున్నారు.

చంపయీ సొరేన్ కొత్త పార్టీ

ప్రకటించిన జార్ఖండ్ మాజీ సీఎం

రాంచి: జార్ఖండ్‌లో అధికార జేఎంఎం పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి కీలక నేత, మాజీ సీఎం చంపయీ సొరేన్ గుడ్‌బై చెప్పనున్నారు. తాను కొత్త పార్టీని స్థాపించి బలోపేతం చేస్తానని బుధవారం ఆయన ప్రకటించారు. వారం రోజుల్లో అన్ని వివరాలూ చెప్తానని అన్నారు. ఈ క్రమంలో నమ్మకమైన స్నేహితుడు కలిసి వస్తే కలుపుకొని వెళ్తానని తెలిపారు. మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చంపయీ సొరేన్ నిర్ణయం జార్ఖండ్ రాజకీయాలను కొత్త మలుపు తిప్పింది. హేమంత్ సొరేన్ జైలుకు వెళ్లిన సమయంలో ఐదు నెలల పాటు చంపయీ సీఎంగా పని చేసిన సంగతి తెలిసిందే.

వచ్చే నెల నుంచి జనగణన?

- 18 నెలల పాటు కొనసాగే అవకాశం
- కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి
- 2021లో జరగాల్సి ఉన్న ప్రక్రియ
- కొవిడ్ కారణంగా వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 21: సెప్టెంబరు నుంచి దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు ఇద్దరు ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారని రాయిటర్స్ న్యూస్ ఏజెన్సీ ఒక కథనంలో పేర్కొన్నది. దేశంలో ప్రతి పదేండ్లకు ఒకసారి జనగణన జరుగుతున్నది. ఈ లెక్కన 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత మహమ్మారి ప్రభావం తగ్గినప్పటికీ జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ లెక్కలన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తూ రావడం వల్ల దేశంలో అసలైన పరిస్థితులు ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో ఎట్టకేలకు వచ్చే నెల నుంచి ఈ ప్రక్రియను ప్రారంభించనున్నట్టు సమాచారం.

18 నెలల పాటు ప్రక్రియ

జనగణన పూర్తి కావడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ ఈ ప్రక్రియకు నేతృత్వం వహించనున్నది. 2026 మార్చిలో ప్రభుత్వ గణాంకాలను వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ప్రధాన మంత్రి కార్యాలయం తుది అనుమతులు రాగానే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్టు ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ పేర్కొన్నది. కాగా, ఇప్పటికే జనాభాలో చైనాను భారత్ దాటిపోయి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిందని గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొన్నది. జనగణనతో ఈ విషయం అధికారికంగా వెల్లడి కానున్నది.

బీజేపీతో స్టాలిన్ పొత్తు?

- కరుణానిధిపై రాజ్‌నాథ్ పొగడ్తల వర్షం
- తమిళనాడులో కొత్త పొత్తులపై ఊహాగానాలు

చెన్నై, ఆగస్టు 21: డీఎంకే వ్యవస్థాపకుడు ఎం కరుణానిధి శతజయంతి ఉత్సవాలు తమిళనాడు రాష్ట్రంలో కొత్త రాజకీయ సమీకరణలపై ఊహాగానాలకు తెరతీశాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అనూహ్యంగా దివంగత నేత కరుణానిధిపై పొగడ్తల జల్లు కురిపించడంతో కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సహా పార్టీ వర్గాలు కూడా ఆశ్చర్యపోయాయి. డీఎంకే నేతలు కూడా పొగడని విధంగా రాజ్‌నాథ్ తమ నేతను ప్రశంసించారని స్టాలిన్ పేర్కొన్నారు. అయితే రాజ్‌నాథ్ చర్యతో రాష్ట్రంలో ఇరు పార్టీల మధ్య కొత్త పొత్తులకు దారితీస్తాయన్న ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. బీజేపీతో స్టాలిన్ పొత్తు పెట్టుకుంటారని, చాలా ఏండ్లుగా కాంగ్రెస్‌తో ఉన్న మైత్రిని తెంచుకుని డీఎంకే ఈసారి బీజేపీతో అడుగులు వేస్తుందని రాజకీయ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. అయితే ఇప్పటివరకు డీఎంకే మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తమ బంధం ఇలాగే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నది.

ఇక గుండెమార్పిడికి తొమ్మిది గంటలు

- 'హార్ట్ ఇన్ ఏ బాక్స్'లో 9 గంటల పాటు సజీవంగా ఉండనున్న గుండె
- భవిష్యత్తులో హార్ట్ ఫెయిల్యూర్ ముప్పు తక్కువ

స్టాక్‌హోమ్, ఆగస్టు 21: మరణం ఖాయమైన వ్యక్తి గుండెను అమర్చి మరో మనిషికి ప్రాణం పోసే గుండె మార్పిడి ప్రక్రియకు ఎంతో మేలు చేసే పరికరాన్ని శాస్త్రవేత్తలు తయారు చేశారు. హైపోథెర్మిక్ ఆక్సిజనేటెడ్ మెషీన్ పెర్ఫ్యూషన్(హోప్) అనే ఈ పరికరాన్ని హార్ట్ ఇన్ ఏ బాక్స్ అని కూడా పిలుస్తారు. ఇందులో గుండెను పెట్టి దాత వద్ద నుంచి అందుకునే వ్యక్తి వద్దకు సరఫరా చేస్తారు.

ఇప్పటివరకు 4 డిగ్రీల సెల్సియస్ ఉండేలా చిన్న రిఫ్రిజిరేటర్లలో గుండెను తరలించేవారు. ఇందులో పొటాషియం సొల్యూషన్ నింపే వారు. అయితే, ఈ పద్ధతిలో దాత నుంచి గుండెను తీసి తర్వాత నాలుగు గంటల్లోనే మరో వ్యక్తికి అమర్చాల్సి ఉంటుంది. సమయం మీరితే గుండె విఫలమవుతుంది. ఈ పరిస్థితిని మార్చడానికి హోప్ పరికరాన్ని తయారుచేశారు. ఇందులో పెడితే గుండె తొమ్మిది గంటల పాటు సజీవంగా ఉంటుందని స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు తేల్చారు. ఈ పరికరంలో గుండెకు ఆక్సిజన్‌తో పాటు పలు రకాల ఫ్లూయిడ్స్ సరఫరా అవుతూ ఉంటాయి. రిఫ్రిజిరేటర్లతో పోలిస్తే ఇందులో రవాణా చేసి ట్రాన్స్‌ప్లాంట్ చేసిన వారిలో గుండె విఫలమయ్యే ముప్పు కూడా 11 శాతం తక్కువ అని పరిశోధకులు తెలిపారు.

కుమారస్వామి విచారణకు అనుమతివ్వండి!

- గవర్నర్‌ను కోరిన కర్ణాటక లోకాయుక్త సిట్
- కేంద్ర మంత్రిపై అక్రమ మైనింగ్ లీజ్ ఆరోపణలు

బెంగళూరు: అక్రమ మైనింగ్ లీజ్ ఆరోపణల కేసులో కేంద్ర మంత్రి, కర్ణాటక మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామిని విచారించేందుకు, చార్జిషీట్ దాఖలు చేసేందుకు అనుమతించాలని కర్ణాటక లోకాయుక్త ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) గవర్నర్ గెహ్లోట్‌ను కోరింది. ఈ మేరకు ప్రతిపాదనను సిట్ సోమవారం మరోసారి సమర్పించింది. కుమారస్వామిని విచారించేందుకు సిట్ తొలిసారిగా గత ఏడాది నవంబర్ లోనూ గవర్నర్ అనుమతి కోరింది. అయితే అప్పుడు అనుమతి ఇవ్వలేదు. ముడా స్కామ్‌లో సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఇప్పుడు ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

కుమారస్వామిపై ఆరోపణలు ఏంటి?

కుమారస్వామి కర్ణాటక సీఎంగా ఉన్న సమయంలో 2007లో చట్టవిరుద్ధంగా శ్రీసాయి వెంకటేశ్వర మినరల్స్ అనే కంపెనీకి బళ్లారి జిల్లా సందూర్ తాలూకా భవిహల్లిలో 550 ఎకరాల్లో మైనింగ్ లీజ్ కట్టబెట్టారన్న ఆరోపణలు వచ్చాయి. లీజ్ కోసం దరఖాస్తు చేసుకొన్న 24 కంపెనీలను కాదని సదరు కంపెనీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

సిద్ధరామయ్య వర్సెస్ కుమారస్వామి

తాజా పరిణామంపై కుమారస్వామి, సిద్ధరామయ్య మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ కేసులో కుమారస్వామిని ఒకవేళ అరెస్టు చేయాల్సిన పరిస్థితి ఉంటే, ఎలాంటి సంకోచం లేకుండా ఆయన్ను అరెస్టు చేస్తామని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. గవర్నర్ అనుమతిస్తారేమోనని కుమారస్వామి భయపడుతున్నారని అన్నారు. సీఎం వ్యాఖ్యలను కుమారస్వామి తిప్పికొట్టారు. 'నన్ను అరెస్టు చేసేందుకు 100 మంది సిద్ధరామయ్యలనైనా రానివ్వండి. నన్ను చూస్తే భయపడుతున్నానని మీరు అనుకొంటున్నారా?' అని పేర్కొన్నారు.

రెడ్ మీట్‌తో మధుమేహ ముప్పు

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: రెడ్ మీట్‌ను తినడం వల్ల టైప్-2 డయాబెటిస్ ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనంలో తేలింది. 20 దేశాల్లోని సుమారు 19 లక్షల మందిపై ఈ అధ్యయనం నిర్వహించారు. 50 గ్రాముల ప్రాసెస్డ్ మీట్‌ను అలవాటుగా తినడం వల్ల టైప్-2 మధుమేహం ముప్పు 15 శాతం పెరిగే అవకాశం ఉంటుందని, 100 గ్రాముల అన్‌ప్రాసెస్డ్ మీట్‌ను తింటే 10 శాతం వరకు, 100 గ్రాముల పౌల్ట్రీ వల్ల 8 శాతం వరకు ముప్పు పెరుగుతుందని తెలిపింది. ఈ అధ్యయన నివేదికను 'ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీ' జర్నల్‌లో ప్రచురించారు. అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, మెక్సికో తదితర దేశాల పరిశోధకులు చెప్తున్నదాని ప్రకారం, ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సిఫారసు చేసిన పరిమాణం కన్నా ఎక్కువగా మాంసాన్ని తినడానికి, టైప్-2 డయాబెటిస్ సహా అసాంక్రమిక వ్యాధులు రావడానికి సంబంధం ఉన్నట్లు నిర్ధారణ అయింది. పదేండ్లపాటు జరిగిన ఈ అధ్యయనంలో 19,66,444 మంది పాల్గొన్నారు. వీరిలో 1 లక్ష మందికి పైగా టైప్-2 మధుమేహం బారినపడ్డారు. రోజూ 50 గ్రాముల ప్రాసెస్డ్ మీట్ తినేవారు దానికి బదులుగా 100 గ్రాముల అన్‌ప్రాసెస్డ్ రెడ్ మీట్ తినడం వల్ల టైప్-2 డయాబెటిస్ సగటున 7 శాతం తగ్గినట్లు వెల్లడైంది. రోజూ 50 గ్రాముల ప్రాసెస్డ్ మీట్‌కు బదులుగా 100 గ్రాముల పౌల్ట్రీని తినడం వల్ల ఈ వ్యాధి ముప్పు 10 శాతం తగ్గింది.

తొలి పునర్వినియోగ రాకెట్

'రూమీ-1' ప్రయోగానికి సిద్ధం

చెన్నై, ఆగస్టు 21: భారత్ మొట్టమొదటి పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ 'రూమీ-1' ప్రయోగానికి సిద్ధమైంది. ఆగస్టు 24న చెన్నైకి సమీపంలోని 'మొబైల్ లాంచ్‌ప్యాడ్' నుంచి ఈ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపుతున్నట్టు తమిళనాడుకు చెందిన టెక్ కంపెనీ 'స్పేస్ జోన్ ఇండియా' సీఈవో ఆనంద్ మేగలింగం తాజాగా ప్రకటించారు. ఈ ప్రయోగంలో.. హైబ్రిడ్ రాకెట్ 'పేలోడ్' తిరిగి సముద్రంలో పడ్డాక దానిని సేకరించి, తిరిగి రాకెట